సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 13 । నవంబర్ । 2024

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

- విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖలీగల్: జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. విశాఖ జిల్లా కోర్టులోని న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోటార్ ప్రమాదాలు, సివిల్, చెక్ బౌన్స్, రాజీపడదగిన క్రిమినల్ కేసులకు పరిష్కారం చూపాలన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. గాజువాక, భీమిలితోపాటు అనకాపల్లి, అల్లూ రి సీతారామరాజు జిల్లాల పరిధిలోని న్యాయమూర్తులు వర్చువల్‌గా ఈ సమావేశానికి హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


కళాశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డు అధికారి అప్పలరాము

సీలేరు: విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని ఇంటర్ బోర్డు జిల్లా అధికారి అప్పలరాము ఆదేశించారు. మంగళవారం ఆయన జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమస్యలు తెలుసుకున్నారు. సైన్సు గూప్రుల నిర్వహణకు పక్కాభవనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ వి.శంకరరావు, ప్రోగ్రామింగ్ అధికారి డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి

గంగవరం : టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర వసతిగృహం, ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా బాలబాలికలతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను తెలుసుకున్నారు. పరీక్షలు దగ్గరపడుతున్నందున శ్రద్ధగా చదువుకోవాలన్నారు. సబ్జెక్టు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచి విద్యా ప్రగతిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో పారిశుద్ధ్యం, పచ్చదనం, పరిశుభ్రతకు సిబ్బంది కృషి చేయాలన్నారు. బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలావుండగా సహాయ సంక్షేమాధికారి కృష్ణమోహన్ పాఠశాలలను తనిఖీ చేశారు.

గంజాయి సాగు చేస్తున్న 18 మంది అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ డేగలరాయి గ్రామ పరిసర ప్రాంతాల్లో 20 చోట్ల 5ఎకరాల్లో గంజాయి సాగు చేస్తున్న 18 మందిని అరెస్టు చేసినట్టు ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు, ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సొలభం పంచాయతీ డేగలరాయి ప్రాంతంలో 20 చోట్ల వెయ్యి గంజాయి మొక్కలను ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు ధ్వంసం చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో డేగలరాయికి చెందిన 18 వ్యక్తులు సాగు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు వారు తెలిపారు.

దివ్యాంగులకు మరింత ప్రోత్సాహం


పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అరకులోయ రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ది ఎబిలిటీ పీపుల్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున సదరం ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. పేర్లు నమోదు చేసుకున్న 22 మంది దివ్యాంగులకు ఉచితంగా వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు తదితర ఉపకరణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ దిలీప్‌పాత్రో, ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో లవరాజు, వైద్యులు సాయిప్రదీప్, అచ్యుతరామయ్య, స్వప్న పాల్గొన్నారు.

మూడు పూటలూ.. ముప్పుతిప్పలే?

గిరిజన విద్యాలయాల్లో భోజనం సరఫరా ప్రైవేట్‌కు అప్పగించే యోచనలో ప్రభుత్వం

గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులకు మూడు పూటలా ఆహారం పంపిణీ బాధ్యత అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అయితే గిరిజన విద్యాలయాలన్నీ మారుమూల ప్రాంతాల్లో ఉన్నందున వీటికి మండల కేంద్రాల నుంచి ఆహారం సరఫరా చేయడం ఎంతవరకు సాధ్యమన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ నిర్ణయాన్ని ఇప్పటికే గిరిజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం అక్షయ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు ఆలోచన చేస్తోందని జిల్లా అధికారవర్గాలు చెబుతున్నాయి.


పాడేరు బాలిక గురుకుల పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థినులు

- అక్షయపాత్ర ఫౌండేషన్‌కు కేటాయించేందుకు కసరత్తు
- ఏర్పాట్లలో నిమగ్నం
- ఇప్పటికే అధికారులతో సమావేశం
- సలహాలు, సూచనల స్వీకరణ
- ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న గిరిజన సంఘాలు, తల్లిదండ్రులు
- పౌష్టికాహార సమస్య పరిష్కారానికే అంటున్న అధికారులు

జిల్లా సమాచారం		
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	:	204
విద్యార్థులు	:	78,400
ఏపీఆర్ విద్యాలయాలు	:	34
విద్యార్థులు	:	10,724
మినీ గురుకులాలు	:	4
విద్యార్థులు	:	2140

సాక్షి,పాడేరు: గిరిజన విద్యాలయాల్లో విద్యార్థులకు మూడు పూటల ఆహారం సరఫరా ప్రైవేట్‌పరం కానుంది. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలకు ఆహారం వండి విద్యార్థులకు పంపిణీ చేసే బాధ్యతను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

అధికారుల నుంచి అభిప్రాయ సేకరణ

ఇటీవల జిల్లాకు చెందిన గిరిజన సంక్షేమ అధికారులు, హెచ్ఎంలు, ఆశ్రమ పాఠశాలల వార్డెన్లు, మేట్రిన్‌లకు అమరావతిలో ప్రత్యేక సమావేశాలను గిరిజన సంక్షేమశాఖ నిర్వహించింది. ఆహారం సరఫరా బాధ్యతలను అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు అప్పగిస్తామని సంబంధిత అధికారులు వెల్లడించారు. దీనిపై సలహాలు, సూచనలు వారి నుంచి పొందారు. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని గిరిజన సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి.

➡ జిల్లాలోని గిరిజన విద్యాలయాల్లో ప్రస్తుతం వార్డెన్, మేట్రిన్, డిప్యూటీ వార్డెన్, డిప్యూటీ మేట్రిన్ వ్యవస్థ ద్వారా వసతి గృహాల విద్యార్థులకు ఆహారం అందిస్తున్నారు. కూరగాయలు, గుడ్లను టెండర్ ద్వారా, బియ్యం, ఇతర నిత్యావసరాలను గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలన్నింటినీ ఐటీడీఏ పీవోలు, గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్లు, సహాయ సంక్షేమ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

➡ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం సక్రమంగా విద్యార్థులకు ఆహారం అందడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కారణంగానే అక్షయ ఫౌండేషన్‌కు అప్పగిస్తామని ఏర్పాట్లు చేస్తోంది. మెనూ సక్రమంగా అమలయ్యేలా అధికార యంత్రాంగంతో చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అక్షయపాత్ర ఫౌండేషన్‌కు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి సూచిస్తున్నాయి.

➡ జిల్లాలో 70 శాతం గిరిజన విద్యాలయాలన్నీ మారుమూల ప్రాంతంలో ఉన్నాయి. వీటికి మండల కేంద్రంలో ఆహారం తయారుచేసి మూడు పూటల సరఫరా చేయడం సాధ్యం కాని పరిస్థితి అని గిరిజన సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వం వసతి గృహాల వ్యవస్థ ద్వారా విద్యార్థులకు వేడివేడిగా ఆహారం అందిస్తున్నారు. రాత్రి భోజనం సాయంత్రం 6 గంటల నుంచి అందిస్తున్నారు.

➡ సంప్రదాయ పద్ధతి వార్పు విధానంలో అన్నం వండుతున్నారు. దీనివల్ల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే స్టీమ్ విధానంలో ఆహారం తయారు చేయడం వల్ల పౌష్టికాహారంపై ప్రభావం చూపుతుందని గిరిజన సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆహారం సరఫరా బాధ్యతను అప్పగించే ఆలోచనను ప్రభుత్వం విరమించాలని ఇటీవల పాడేరు వచ్చిన గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి ఆ సంఘ నేతలు వినతి పత్రం అందజేశారు.

నాణ్యమైన ఆహారమే లక్ష్యం



గిరిజన ప్రాంత విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం లక్ష్యంగా ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఆరోగ్యపరంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు బాధ్యత అప్పగిస్తే ఎంతవరకు గిరిజన విద్యార్థులకు సకాలంలో నాణ్యమైన ఆహారం అందుతుందనే అంశంపై సర్వే జరుగుతోంది.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, పాడేరు

గిరి విద్యార్థులకు ఇబ్బందే



గిరిజన విద్యాలయాల్లో ఆహారం సరఫరా బాధ్యత ప్రైవేట్‌కు అప్పగించడం వల్ల ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఉంది. మండల కేంద్రాల్లో వంటలు చేసి దూరంగా ఉన్న విద్యాలయాలకు తరలించడం సాధ్యం కాని పరిస్థితి. గిరిజన విద్యాలయాల్లో పోస్టులు కూడా పోయే పరిస్థితి ఉంటుంది. వర్కర్లు వీధిన పడే ప్రమాదం ఉంది. ప్రైవేట్ సంస్థకు అప్పగించే యోచనను ప్రభుత్వం విరమించాలి.

– పి.బాలదేవ్, జిల్లా అధ్యక్షుడు,గిరిజన సంఘం, పాడేరు


గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి వివరిస్తున్న గిరిజన సంఘం ప్రతినిధులు (ఫైల్)


పాడేరు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో భోజనాలు

ఈత పోటీల్లో వైద్యాధికారి సాయిశ్రీ ప్రతిభ



- రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

సాక్షి,పాడేరు: విజయవాడలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఇటీవల నిర్వహించిన అఖిల భారత సివిల్ సర్వీసెస్ 2024 రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సాయిశ్రీ ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 50 మీటర్లు, వంద మీటర్లు ఫ్రీస్టైల్, 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో ఆమె ప్రథమ స్థానం సాధించారు. ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఆమె అర్హత సాధించారు. పోటీల్లో రెండు బంగారు పతకాలను సాధించిన సాయిశ్రీని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, మినుములూరు వైద్యాధికారి గోపాలకృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి సింహాద్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నాలుగేళ్ల వయసు నుంచి విజయవాడ సర్వీజ స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకున్నానని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్ర స్థాయిలో 72 బంగారు పతకాలు, 24 వెండి పతకాలు,11 కాంస్య పతకాలు, జాతీయ స్థాయిలో ఐదు బంగారు పతకాలు సాధించానని ఆమె తెలిపారు.

ఉద్యాన పంటల ప్రోత్సాహానికి కృషి

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


నర్సరీ పనులను ప్రారంభిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. సిరిగిందలపాడు హెచ్ఎన్‌టీసీ ఫారంలో మంగళవారం జీడిమామిడి , మామిడి మొక్కలు, జాఫ్రా మొక్కలు అంట్లు కట్టే కార్యక్రమాన్ని పీవో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు ఉద్యాన పంటలు వేసుకునే విధంగా సబ్సిడీపై 2024–25 సంవత్సరానికి 30 వేల ఉద్యాన వన పంట మొక్కలు గిరిజన రైతులకు అందజేస్తామన్నారు. వచ్చే ఏడాదికి 50 వేల అంటు మొక్కలు తయారీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మారేడుమిల్లిలో ఉద్యాన వన మొక్కల నర్సరీ, రబ్బరు మొక్కల అంట్లు తయారీకి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. పీహెచ్‌వో కె. చిట్టిబాబు, సబ్ అసిస్టెంట్లు భీమన్న, నూకరాజు పాల్గొన్నారు.

దోమల నివారణపై దృష్టి పెట్టండి

కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

సాక్షి,పాడేరు: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 3,206 మలేరియా,53 డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. తీవ్ర జ్వరం, ఒళ్లు,కీళ్ల నొప్పులు,తలనొప్పి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి సేవలు పొందాలే ప్రజలకు వైద్యబృందాలు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే చేసి ఆక్టివ్ సర్వైలెన్స్, మాసివ్ సర్వైలెన్స్ నిర్వహించాలని ఆదేశించారు.ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. సచివాలయం సిబ్బంది మూడు పర్యాయాలు హాజరు వేయాలని, హాజరు నమోదు కాకపోతే అందుకు సంబంధించిన జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. సచివాలయాల్లో సేవా రుసుంను రెండు పనిదినాల్లో ప్రభుత్వానికి చెల్లించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిధులు దుర్వినియోగం చేస్తే పోలీసు కేసు నమోదు చేస్తామన్నారు. గత 12 రోజులకు సంబంధించి రూ.6,39,253 పెండింగ్‌లో ఉందన్నారు. ఈనెల 15న బిర్సాముండా జయంతి పురస్కరించుకుని ప్రత్యేక గ్రామసభలను మోడల్ కోడ్‌కు అనుగుణంగా నిర్వహించాలన్నారు. జిల్లాలోని 25,578 పీఎం జన్‌మన్ గృహ నిర్మాణాలకు సంబంధించి 23,073 మంది లబ్ధిదారులు మాత్రమే ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చారన్నారు. మిగిలిన ఇళ్లకు లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. వారినుంచి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన వారికి జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, నూరు రోజుల ఉపాధి పనిదినాలు కల్పించాలని సూచించారు. డీఎంహెచ్‌వో జమాల్‌బాషా, డ్వామా పీడీ శివయ్య, జిల్లా వ్యవసాయ,ఉద్యానవన అధికారులు ఎస్‌బీఎస్ నందు, రమేష్‌కుమార్‌రావు, సీపీవో కేఎస్ఎస్ఆర్ పట్నాయక్, హౌసింగ్ ఈఈ బాబు, డీఎల్‌పీవో పీఎస్ కుమార్ పాల్గొన్నారు.


వీడియో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

అదనపు ఆదాయంతో సుస్థిరత సాధ్యం

రైతులకు అదనపు ఆదాయంతోనే సుస్థిరత ఉంటుందని, ఈ దిశగా ప్రభుత్వం యంత్రాంగం, ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ కోరారు. స్థానిక పీఎంఆర్‌సీలో మంగళవారం నిర్వహించిన అమ్మకం మరియు కొనుగోలుదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి సాధ్యమన్నారు.జిల్లాలో మూడు వేల ఎఫ్‌పీవోలు పనిచేస్తున్నాయని, మంచి ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. మార్కెటింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి రైతు పారిశ్రామికవేత్తగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.అనంతరం పెరటికోళ్లు, వివిధ వ్యవసాయ, అనుబంధ ఉత్పత్తులు, మార్కెట్ ట్రెండ్, విలువ ఆధారిత ఉత్పత్తులపై కొనుగోలుదారులతో చర్చించారు. ఈ సందర్భంగా కొనుగోలుదారులు,అమ్మకందారులు,ఎఫ్‌పీవోల మధ్య ఒప్పందాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో హైపర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ కట్టా శ్యామ్, వ్యవసాయ, ఉద్యానవనశాఖల జిల్లా అధికారులు ఎస్‌బీఎస్.నందు, పి.రమేష్‌కుమార్‌రావు, డ్వామా పీడీ ఎం.శివయ్య, నవజీవన్ అధ్యక్షుడు సహదేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవిలో ఆఖరి పోరాటం

- మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా బస్తర్ వ్యూహం
- ఆపరేషన్ మొదలు పెట్టిన కేంద్ర హోంశాఖ
- నాలుగు రాష్ట్రాల దండకారణ్యంలో గాలింపు ముమ్మరం
- ఏవోబీ వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తం


గాలింపు చర్యలలో గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు

సాక్షి,పాడేరు: మావోయిస్టుల కార్యకలాపాల నిరోధమే లక్ష్యంగా కేంద్రం హోంశాఖ ఆపరేషన్ మొదలు పెట్టింది. 2026 నాటికి వారిని ఏరివేయాలన్న కార్యాచరణతో ముందుకు సాగుతోంది. దండకారణ్యంలోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన అబుజ్‌మడ్(బస్తర్) అడవులు మావోయిస్టులకు సురక్షిత ప్రాంతం. ఆంధ్రా, తెలంగాణ, ఒడిశాలోని విధ్వంసాలు సృష్టించినప్పుడల్లా మావోయిస్టులు ఆ ప్రాంతానికి వెళ్లిపోతుంటారు. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతోపాటు ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంలో సోమవారం సమావేశమయ్యారు. ఆపరేషన్ బస్తర్, యాంటీ నక్సల్స్ దళాలతో దండకారణ్యంలో చేపట్టే గాలింపు చర్యలపై సమీక్షించినట్టు సమాచారం.

ప్రతికూలతతో..

- ఛత్తీస్‌గఢ్‌లోని అబుజ్‌మడ్ అడవుల్లో పోలీసు నిర్బంధం తీవ్రంగా ఉండడంతో మావోయిస్టులు సరిహద్దులోని తెలంగాణ, ఒడిశా, ఆంధ్రా (అల్లూరి సీతారామరాజు జిల్లా)ప్రాంతాల్లోని అటవీ ప్రాంతాల్లోకి వచ్చే పరిస్థితిని కేంద్ర నిఘా వర్గాలు పసిగట్టాయి. వెంటనే ఆయా రాష్ట్రాల పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్టు సమాచారం.

కోలుకోలేని నష్టం

మావోయిస్టు పార్టీ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటోంది. గత ఏడేళ్లలో దండకారణ్యంలో సుమారు 200మంది మావోయిస్టులు ఎదురుకాల్పుల ఘటనల్లో ప్రాణాలు కోల్పోయారు. గత నెల 4న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్–దంతేవాడ సరిహద్దు అబుజ్‌మడ్ అడవిలో పోలీసు బలగాల ఎదురుకాల్పుల ఘటనలో 38 మందిని మావోయిస్టు పార్టీ కోల్పోయింది. అప్పటినుంచి ఆ ప్రాంతంలో వారి కదలికలు తగ్గాయి. ఉన్న క్యాడర్‌ను కాపాడుకునే ప్రయత్నంలో వారు ఉన్నట్టు సమాచారం. దీనిలో భాగంగానే ఏవోబీలో తలదాచుకునేందుకు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసు బలగాలు అప్రమత్తమయ్యాయి.

గాలింపు ముమ్మరం

ఆంధ్రా, ఒడిశాతో పాటు సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో పోలీసు బలగాలు గాలింపు ముమ్మరం చేశాయి. యాంటీ నక్సల్స్ దళాలు, సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్ బలగాలు ఏవోబీలో మోహరించాయి. జిల్లాలోని ప్రధాన జంక్షన్లు, మారుమూల ప్రాంతాలకు వెళ్లే రోడ్లలో తనిఖీలు ముమ్మరం చేశాయి.

సమాజ మార్పులో యువత కీలకం

ఎస్పీ అమిత్ బర్దర్


మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

అరకులోయ రూరల్: సమాజమార్పులో యువత కీలకమని ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు. పోలీసుశాఖ స్థానిక అతిథి గృహంలో సీఐ హిమగిరి ఆధ్వర్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిర్మూలన యువతతోనే సాధ్యమని, ఈ దిశగా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. అందరూ ఏకమై ప్రజలను చైతన్యపథంలో నడిపిద్దామని ఎస్పీ పిలుపునిచ్చారు. ఎస్‌ఐ గోపాలరావు, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులు నర్సింగ్, వెంకట్, అద్దు, వెంకటరావు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ పోలీసుస్టేషన్ సందర్శన

డుంబ్రిగుడ: స్థానిక పోలీసుస్టేషన్‌ను ఎస్పీ అమిత్‌బర్దర్ మంగళవారం సందర్శించారు. గంజాయి నియంత్రణపై పూర్తిగా దృష్టిపెట్టి, ఎప్పటికప్పుడు సమాచారం తమకు నివేదించాలని ఆయన ఆదేశించారు. గంజాయిసాగుపై ఎప్పటికప్పుడు డ్రోన్‌తో సర్వే చేసి తగు చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి రహిత మండలంగా తీర్చిదిద్దాలని ఎస్‌ఐ పాపినాయుడును ఆదేశించారు. రికార్డులను పరిశీలించారు. మండలంలోని మూడు రోడ్లు గుంటసీమ జంక్షన్, అంతర్ రాష్ట్ర రహదారి జైపూర్ జంక్షన్లో వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.

తుస్సుమన్న 'పంచాయతీ'
- పక్కదారిపట్టిన ఈవోపీఆర్డీ బదిలీల విచారణ

6లో

మాతా శిశు మరణాలు సంభవిస్తే చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం


హాజరైన వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు


మాట్లాడుతున్న పీవో సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో మాతాశిశు మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వైద్యులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశు మరణాలను అరికట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత వైద్యాధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. జ్వరాలకు సంబంధించి ఇంటింటి సర్వే నిర్వహిం,చాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్‌వో శిరీష, వైద్యాధికారులు వినోద్, షాహిన్, సంతోష్, లక్ష్మి, ఒమీనా, ఝాన్సీ, సుప్రియ పాల్గొన్నారు.